క్లుప్తంగా

వ్యవసాయ కార్యాలయ ఆవరణలు శుభ్రం


పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆధ్యాత్మిక సేవకులు

నగరి : స్థానిక వ్యవసాయ కార్యాలయం, ఆర్బీకే ఆవరణలో చెట్ల నుంచి రాలిన ఆకులు, చెత్తకుప్పలను ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమ సేవకులు శుభ్రపరిచారు. ఆదివారం ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి వీటీ భాస్కర్ ఆధ్వర్యంలో కార్యాలయాల వద్దకు వెళ్లిన వారు శ్రమదానం చేపట్టారు. అక్కడి కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో షణ్ముగ రెడ్డి, భాస్కర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు ఘన సన్మానం


తహసీల్దార్ ఇన్బనాథన్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు తహసీల్దార్ ఇన్బనాథన్ అన్నమయ్య జిల్లా రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు, డీటీలు, ఆర్ఐలు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువలు, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మండలంలో సుదీర్ఘకాలం పాటు వివిధ హోదాల్లో ఇన్బనాథన్ పని చేశారని, కరోనా, తుపాన్ లాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు సర్పంచ్ మునిరాజా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చిన్నమ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేంద్ర రెడ్డి, బాబు నాయుడు, డీటీలు తులసీరాం, విజయకృష్ణ, ఆర్ఐలు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో యువతకు ప్రోత్సాహం


కబడ్డీ జిల్లాల్లో ద్వితీయ స్థానంలో వచ్చిన యువకులకు సన్మానం చేస్తున్న

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహిస్తున్నారని, వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. ఆదివారం కబడ్డీ పోటీల్లో జిల్లాల్లో ద్వితీయ స్థానం సాధించిన యువకులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి యువకులతో ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీల్లో ఓటమి, గెలుపు సహజం అందువల్ల ప్రతి క్రీడలను అన్నదమ్ముల్లా కలసి మెలసి ఆడాలన్నారు. అనంతరం పీహెచ్‌పీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్ రాజు, ఎంపీపీ శ్యామల, ఎంపీడీఓ రామనాథరెడ్డి కలసి యువకులకు శాలువాలతో సన్మానం చేశారు.

ఇంటి స్థలాలపై వదంతులు నమ్మొద్దు

- టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్

తిరుపతి(అలిపిరి): ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలను నేరుగా టీటీడీ సంస్థ అందిస్తోందని... ఇందులో ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని.. కొందరి మోసపూరిత మాటలు నమ్మవద్దని టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగులు ఎంతో సంతోషంగా పట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న సమయంలో డబ్బులు చెల్లించరాదని.. మాయమాటలు చెబుతున్నారన్నారు. వాటిని నమ్మకుండా 5వ తేదీ సోమవారం నుంచి ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 15 మంది ఉద్యోగులతో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లైజన్ ఆఫీసర్లుగా వెల్ఫేర్ ఆఫీసర్ స్నేహలత, డెప్యూటీ ఈవో ప్రశాంతి, డెప్యూటీ ఈవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు చేయబడుతాయని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ త్వరగా ఇంటి స్థలాల ఖరీదు రూ.2,99,483తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.24,650 మొత్తం రూ.3,24,133 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఫ్లాట్ ఖరీదుతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు కట్టిన వారికి సీనియారిటీ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఇంటి స్థలాలను పొందిన ఉద్యోగులు 15 సంవత్సరాల వరకు అమ్మడానికి కుదరదు అనే నిబంధనను టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు సడలించారన్నారు. ఇంటి స్థలాలపై ఎటువంటి సందేహాలు ఉన్నా వెల్ఫేర్ ఆఫీసర్‌ను గానీ టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ కార్యవర్గ సభ్యులు రంగా నాయక్, హేమలత, ఇ.సునీల్ కుమార్, శ్రీహరి, రేఖ, కొప్పర్తి శివ, అశోక్ కుమార్, కోలా గిరి, ఈ.శ్రీనివాస మూర్తి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్రపర్వంగా నిర్మించిన దేశమ్మ దేవాలయం


నాడు దేశమ్మ దేవాలయం


మినీ కళ్యాణ మండపం


దేదీప్యమానం..నేత్ర ప్రదాయినీ క్షేత్రం

- చారిత్రక ఆలయానికి మహర్దశ
- ఆలయాల అభివృద్ధి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- మంత్రి ఆర్‌కే రోజా చొరవతో రూ.3.6 కోట్ల మేర సమకూరిన నిధులు
- నేత్రపర్వంగా నేత్రప్రదాయని అమ్మవారి ఆలయ నిర్మాణం
- నేటి నుంచి శాస్త్రోక్తంగా కుంభాభిషేక వేడుకలు

నగరి : నేత్రప్రదాయినిగా ప్రసిద్ధి గాంచిన దేశమ్మ దేవత ఆలయం దేదీప్యమానంగా నిర్మితమైంది. నాడు చిన్న ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చిన నేత్రప్రదాయని దేశమ్మ అమ్మవారు ఇకపై బ్రహ్మాండంగా నిర్మితమైన దర్శనమివ్వనున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆలయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సుమారు రూ.3.6 కోట్ల నిధులతో దేవదాయశాఖ పరిధిలోని దేశమ్మ దేవత ఆలయంలో జరిగిన అభివృద్ధి పనులే అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు చిన్నపాటి ఆలయం ఇది. ఆలయం ముందు రేకులతో వేసిన షెడ్డు, భక్తులు వస్తే పొంగళ్లు పెట్టుకోవడానికి ఖాళీగా ఉన్న మైదానం, శిథిలావస్థలో ఉన్న కల్యాణకట్ట ఇవే దర్శనమిచ్చేవి. అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయం కావడంతో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులకు వస్తారు. కానీ అవసరమైన వసతులు ఉండేవి కావు. దానికితోడు గత ప్రభుత్వాలు ఈ ఆలయ అభివృద్ధికి ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించేందుకు మంత్రి ఆర్కేరోజా కంకణం కట్టుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించడంతో పాటు దాతలు కూడా ఆలయ నిర్మాణంలో పాలుపంచుకునేలా చొరవ చూపారు. దీంతో ఆలయంలో రూ.3.6 కోట్లు మేర అభివృద్ధి పనులు జరిగాయి. అత్యద్భుతంగా ఆలయం నిర్మితం కావడంతో పాటు పరివార దేవతలైన వినాయక, సుబ్రమణ్య, నాగదేవత ఆలయాలు, ఆర్వో వాటర్ ప్లాంటు, భక్తులకు తగిన విధంగా బాత్రూమ్‌లు, ఆలయం వద్ద వేడుకలు నిర్వహించుకునేవారికి మినీ కల్యాణ మండపం, నవగ్రహ మండపం, ప్రహరీగోడ, పొంగళ్ల మండపం, విడిదిగదులు, కల్యాణకట్ట ఇలా అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరాయి.

ఆలయ చరిత్ర..

ఆలయ పురాణం మేరకు పార్వతీదేవి ఇక్కడ దేశమ్మ దేవతగా విరాజిల్లుతోంది. శివశాపంతో అలిగి భూలోకానికి వచ్చిన పార్వతి దేశసంచారం చేస్తూ ఇక్కడ తపస్సు చేసుకున్నందున అమ్మవారికి దేశమ్మ అన్న పేరు వచ్చింది. పూర్వం అరణ్యంలా ఉన్న ఈ ప్రాంతంలో ముళ్ల కంపల కోసం వచ్చిన ఒక వృద్ధురాలికి కంటికి ముళ్లుగుచ్చుకుని చూపు పోవడంతో కింద పడింది. ఆ సమయంలో 'అవ్వా నువ్వు పడిన చోట ఒక విగ్రహం ఉంది పక్కనే ఉన్న గుంటలోని నీరు తెచ్చి ఆ విగ్రహానికి అభిషేకం చేసి ఆ నీటిని కంటిలో పోసుకో చూపు వస్తుంది' అని ఒక బాలిక గొంతు వృద్ధురాలికి వినిపించింది. అలా చేసిన వృద్ధురాలికి చూపు వచ్చింది. నాటి నుంచి నేత్ర ప్రదాయణి దేశమ్మగా అమ్మవారు ఇక్కడ కొలువుదీరారు. కార్వేటినగరం రాజుకు కంటిపూత వచ్చిన సమయంలో ఆలయ విశిష్టతను తెలుసుకుని ఇక్కడకు వచ్చి పూజించి నీటిని కళ్లలో వేసుకోగా కంటిపూత నయమైంది. దీంతో 1870లో ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆలయంలో తీర్థం కంటిలో పోయడం పరిపాటిగా వస్తోంది. ఇలా మరే ఆలయంలోను తీర్థం కంటిలో పోసే సంప్రదాయం లేదు. 1952లో దేవదాయశాఖ వారు ఆలయాన్ని స్వాధీనం చేసుకుని ఆలయ పర్యవేక్షణకు కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో పరిపాలన జరుగుతూ వస్తున్నా అప్పుడప్పుడు చిన్నపాటి మరమ్మతులు మాత్రమే జరిగేవి. 154 ఏళ్లకు ఆలయాన్ని పునర్ నిర్మించే మహద్భాగ్యం ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మంత్రి ఆర్కే రోజాకు, ప్రస్తుత పాలకమండలికి దక్కింది.

నేటి నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

దేశమ్మ ఆలయంలో సోమవారం నుంచి 11వ తేదీ వరకు మహత్తరంగా ఆలయపునర్నిర్మాణ జీర్ణోద్ధరణ, రజిత అష్టబంధన కుంభాభిషేక ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం మంత్రి ఆర్‌కే రోజా మహాగణపతి పూజతో కుంభాభిషేక ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 6వ తేదీ యాగశాల పూజలు ప్రారంభిస్తారు. 7న వాస్తుహోమాలు, 8న చతుర్విద హోమాలు, 9న పంచగవ్యాధివాసం, 10న ధాన్య, వస్త్ర, పుష్ప, శయ్యాధివాసములు నిర్వహించి 11వ తేదీన మహాకుంభాభిషేక వేడుకలు చేపట్టి సర్వాలంకరణతో భక్తులకు ప్రథమ దర్శనాన్ని కల్పించనున్నారు.

ఆలయ నిర్మాణాలకు ప్రభుత్వం చొరవ



ఆలయ నిర్మాణాలపై ప్రస్తుత ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో సీజేపీ నిధుల ద్వారా రూ.100 కోట్లతో ఆలయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక చొరవతో ఆలయ నిర్మాణానికి నిధులు విడుదల కావడం, దాతలు ముందుకు రావడంతో నేడు నేత్ర ప్రదాయణి ఆలయం నేత్రపర్వంగా నిర్మితమైంది.
– రామచంద్రయ్య, ఈఓ, దేశమ్మ దేవస్థానం, టీఆర్.కండ్రిగ, నగరి

అమ్మవారు ఇచ్చిన అవకాశం..



ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావడం అదృష్టంతో పాటు అమ్మవారి ఆశీస్సులతో కూడిన అంశం. ఆ భాగ్యం మంత్రి రోజమ్మకు దక్కింది. ఆమె ఆశీస్సులతో నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం నాకు దక్కింది. ఆమె చూపిన చొరవతో పలువురు దాతలు ముందుకు వచ్చారు. నా వంతుగా సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మించాను. ఆలయం అత్యద్భుతంగా రూపుదిద్దుకుంది.
– వేణుబాబు, ఆలయకమిటీ చైర్మన్, దేశమ్మ దేవస్థానం, టి.ఆర్.కండ్రిగ, నగరి.


వినాయక ఆలయం


సుబ్రమణ్యస్వామి ఆలయం


నాగమ్మ ఆలయం


ఆర్వోప్లాంటు గది


మరుగుదొడ్లు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల


సమావేశంలో హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

- మండలమీట్‌లో ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ అన్బళగన్

పాలసముద్రం : మండల పరిధిలోని గ్రామాల్లో వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ మండలంలో మరమ్మతులకు గురైన చేతి పంపులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు చేతి పంపులోని నీటిని ప్రజలు వాడుకుంటారని తెలిపారు. తాగునీటి ట్యాంకులను సకాలంలో శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్లు వేయాలన్నారు. ప్రభుత్వం పథకాలకు అర్హులై పథకాలు అందకుండా ఉన్నవారిని గుర్తించి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జగనన్న కాలనీలో గృహనిర్మాణ పనులు పూర్తి చేసి గృహప్రవేశం చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా చెరువు మొరవ కాలువలు, పండ్లతోటల పెంపకం శ్మశానానికి రోడ్డు వంటివి చేయించాలన్నారు. ప్రభుత్వం జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ మాట్లాడుతూ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల కేంద్రాలను గుర్తించి జాబితా ఇస్తే, జెడ్పీ నిధుల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గుడ్లు, పాలు, నిత్యావసర సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, ఎంపీటీసీ గోవింద రాజు, లిఖిత, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, మహేష్ బాబు, శోభ, జీవిత, నరసింహరాజు, అనురేఖ, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, ఏపీఓ మార్గరేట్, వైద్యాధికారి మోహన్‌కృష్ణ, ఏఓ డిల్లీప్రసాద్, హౌసింగ్ ఏఈ దాము, ఎంఈఓ గిరిజ, మండల విస్తరణాధికారి రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత, పోలీస్‌శాఖ, అరుల్, ప్రకాష్, భాస్కర్ అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

చంద్రగిరి: ఆకుతోట వీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం పూరిగుడిసె కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే... ఆకుతోట వీధికి చెందిన ధనమ్మకు చెందిన చుట్టు గుడిసెలో ఆదివారం ఉదయం హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు, ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో వృద్ధురాలు ధనమ్మ గుడిసెలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గుడిసె పూర్తి కాలిపోవడంతో కట్టుబట్టలతో వృద్ధురాలు మిగిలిపోయింది. గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన


ఆర్వో ప్లాంట్ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : పట్టణ పరిధిలోని ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవత ఆలయ కుంభాభిషేక వేడుకల ఏర్పాట్లను మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ ఆవరణలను, నూతన నిర్మాణాలను చూసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలపై ఆలయక కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్యను అడిగి తెలుసుకున్నారు. బాలాలయంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలను మంత్రి రోజాకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

16 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్టు

శ్రీకాళహస్తి : మండలం చిన్నకనపర్తి వద్ద ఆదివారం కోడిపందెం స్థావరాలపై దాడులు నిర్వహించి పోలీసులు 16 మందిని అరెస్టు చేశారు. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. చిన్నకనపర్తి పంటపొలాల్లో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించారు. చిన్నకనపర్తి, పెళ్లకూరు, శ్రీకాళహస్తికి చెందిన 16మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.3350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేలపై మృత్యు తీగలు


కిందికి వేలాడుతున్న వైర్లు


నేలపై ఉన్న విద్యుత్ వైర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొలాల్లో నేలపై విద్యుత్ తీగలు రైతులను భయందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలోని తహానగర్, పూసలపల్లి, చిన్నయగుంట గ్రామాల్లోని పొల్లాలో మోటారు విద్యుత్ వైర్లు నెలపైనే ఉన్నాయి. మోటార్లు వద్దకు స్తంభాలను ఏర్పాటు చేయకపోడంతో రైతులు నెలపై విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసుకున్నారు. వైర్లు తగిలితే ప్రాణానికే ప్రమాదం ఉంది. అదేవిధంగా కొన్ని చోట్ల వ్యవసాయ మోటార్లుకోసం 20 సంవత్సరాలు కిందట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వైర్లు స్తంభాలకు ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు కావడంతో వదులుగా ఉన్నాయి. వదులుగా ఉన్న విద్యుత్ వైర్లును గట్టిగాలాగి మరమ్మతులు చేపట్టవలసిన ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

త్రీడీ ఎఫెక్ట్ రొంబా సూపర్ ..!


చంద్రగిరి కోటలో పుదుకుప్పం తమిళ హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులు

- సైన్స్‌సెంటర్‌లో కేరింతలు కొట్టిన పుదుకుప్పం తమిళ విద్యార్థులు
- కొత్త అనుభూతినిచ్చిన విజ్ఞానయాత్ర

సత్యవేడు:''డే..డే.. అంగ్ పార్ డా..అంద పెరియ కాడు పాంబు నంబమేల్‌కు వరుదు..రొంబా భయమా ఇరుక్కుదు..(రేయ్..రేయ్ అది చూడరా ..ఆ కొండ చిలువ మన మీదకు వస్తోంది.. నాకు చాలా భయంగా ఉంది)..''..అని కొందరు ''అమ్మో! మేలిరిందు పెరియ కల్ నంబు మేల్ వుయ్‌రా మరియక్కీదు.. పోయిడలాం ఇంగిరిందు(ఆ పెద్ద గ్రహ శకలాలు మన మీద పడేలా వస్తున్నాయ్..మనం ఇక్కడ నుంచి వెళ్లిపోదాం..)..త్రీ డీ ఎఫెక్ట్ రొంబా సూపర్ డా ..(త్రీడీ ఎఫెక్ట్ భలే ఉన్నాయ్ రా)'' ఇదీ మండలంలోని పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూలు విద్యార్థినీ విద్యార్థుల్లో ఒకింత భయం, ఆనందం, ఏదో కొత్త లోకంలో విహరిస్తున్నట్లు..ఊపిరి సలపనివ్వని ఉద్వేగంతో ఊగిపోయిన ఆనంద క్షణాలు. ఈ స్కూలు నుంచి తొలిసారి 75మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేక బస్సులో విజ్ఞాన విహారయాత్రకు తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు టీచర్లు తీసుకెళ్లారు. తొలుత తిరుపతి కలెక్టరేట్, ఆ తర్వాత చంద్రగిరి కోట, జూపార్క్, తిరుపతిలోని సైన్స్ సెంటర్, ఇస్కాన్ మందిరాన్ని సందర్శించారు. ఆయా ప్రాంతాల గురించి టీచర్లు వారికి వివరించారు. జూపార్క్‌లో రకరకాల వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి కేరింతలు కొట్టారు. ఇవంతా ఒక ఎత్తైతే, సైన్స్‌సెంటర్ మినీ ఆడిటోరియంలో పది నిమిషాల నిడివితో 'అనిమల్ ప్లానెట్' త్రీడీ లఘు చిత్రం చూడడం వారికి సరికొత్త అనుభూతినిచ్చింది. త్రీ డీ కళ్లద్దాల ఎఫెక్ట్ వారిని వన్యప్రాణుల మధ్య సంచరిస్తున్నట్లు, గ్రహాంతరయానం చేసినట్టు అను భూతికి గురై ఉద్వేగంతో తమ విద్యార్థులు కేరింతలు కొట్టారని ఇంగ్లిష్ టీచర్ జగదీష్ చెప్పారు. పట్నం చూడని తమిళనాడు సరిహద్దు మారు మూల ప్రాంతాల విద్యార్థులకు విజ్ఞాన విహారయా త్ర మధురానుభూతులు మిగిల్చింది. టీచర్లు శివ, ఏకాంబరం, మునిబాల, ఆంథోని, వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్‌ప్రతిమ పాల్గొన్నారు.



బీసీలకు అగ్రతాంబూలం

ఏర్పేడు: రాజకీయ పదవులల్లో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సరస్వతికండ్రిగలో ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు.

In The Court of the Civil Judge
(Junior Division: Nagari)
O.S.No.55/2019

K.C.Meera ...Plaintiff
V/s
S.G.Malliga & Others ...Defendants

summons
to Defendants No.2 and 4

D2) S.G.Anandan S/o S.K.Ganesh,
D4) S.G.Pushpalatha W/o Kanniyappan, Both are residing at D.No.6-101, Kotha Street, Pudupeta village, Nagari Town & Municipality, Chittoor District. A.P.,

The Plaintiff herein filed above suit and the same is posted for your appearance before this Hon'ble Court on 08.02.2024 in persons or through your Advocate at about 10.30 am and file your objection if any otherwise the matter will be decided Ex-parte

Date of Hearing: 08.02.2024

G.Thirumalaia, K.Rajesh
N.Ramamoorthi, M.Madhan
Advocates, Nagari